సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 28 । ఫిబ్రవరి । 2025



తేరుపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

బ్రహ్మోత్సవాల్లో నేడు

స్కంధరాత్రి (మాఘ బహుళ అమావాస్య)

వాహన సేవలు

ఉదయం 9 గంటలకు : అధికార నంది - కామధేనువు వాహన సేవ

ఉభయదాతలు: కోత్వాల్ చెంగల్రాయులు జ్ఞాపకార్థం, పసుపులేటి రాజగోపాల్ కుమారులు, శ్రీకాళహస్తి (శాశ్వత ఉభయకర్త 2025 వరకు)



రథోత్సవంలో ఏనుగు ప్రతిమలు

భక్తి సాగరంలో.. మునిగితేలారు!

- అంగరంగ వైభవంగా శ్రీకాళహస్తీశ్వరుడి రథోత్సవం
- తెప్పపై విహరించిన స్వామి,అమ్మవార్లు



తెప్పోత్సవానికి పోటెత్తిన జనం(ఇన్‌సెట్) తెప్పపై స్వామి, అమ్మవార్లు

రథోత్సవంలో దొంగల చేతివాటం



బంగారు గొలుసు పోగొట్టుకున్న సుభాషిణి

రథోత్సవంలో దొంగలు తమచేతి వాటం ప్రదర్శించారు. తొట్టంబేడు మండలం, కంచనపల్లి గ్రామానికి చెందిన సుభాషిణి అనే మహిళ రథోత్సవానికి రాగా.. నగరి వీధిలో గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని మూడు సవర్ల బంగారు గొలుసు తెంపుకుని వెళ్లారు.

శ్రీకాళహస్తి:శ్రీకాళహస్తీశ్వరాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం ఉదయం శ్రీకాళహస్తీశ్వరుడు, జ్ఞానప్రసూనాంబ రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. తేరువీధి, నెహ్రూవీధి, నగరివీధి, బజారువీధి భక్తులతో కిక్కిరిసిపోయాయి. హరహర మహాదేవ, శంభోశంకర అంటూ స్వామివారి రథాన్ని ముందుకు కదిలించగా.. జైజై కాళీ, జైజై భద్రకాళి నామాన్ని స్మరిస్తూ అమ్మవారి రథాన్ని ముందుకు నడిపించారు. రథోత్సవం సందర్భంగా భక్తులు ఉప్పు, మిరియాలను చల్లుతూ మొక్కులు తీర్చుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఈఓ బాపిరెడ్డి, బీజేపీ నాయకుడు కోలా ఆనంద్ పాల్గొన్నారు.

వివక్షతోనే ఇక్కట్లు

మాజీ కౌన్సిలర్ ఆర్కాటు ముత్తు చాలా ఏళ్లుగా రథోత్సవంలో సేవలందించేవారు. కానీ ఆయన వైఎస్సార్‌సీపీ నాయకుడు కావడంతో కూటమి నేతలు కక్ష్య గట్టారు. శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం పంపకుండా అవమానించారు. ఈ క్రమంలో రథోత్సవానికి కొత్తవారిని నియమించుకున్నారు. వారు సకాలంలో బ్రేక్‌లు వేయకపోవడంతో భక్తులు కొంత ఇబ్బంది పడ్డారు.

తెప్పోత్సవం

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం రాత్రి నారద పుష్కరణిలో శివ పార్వతుల తెప్పోత్సవం నయనానందకరంగా సాగింది. విద్యుద్దీప కాంతుల్లో విహరిస్తున్న స్వామి, అమ్మ వార్లను దర్శించుకుని భక్తులు పునీతులయ్యారు.

నేడు శివపార్వతుల కల్యాణం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం రాత్రి శివపార్వతుల కల్యాణం నిర్వహించనున్నారు. రాత్రి 10 గంటల తర్వాత గజ వాహనంపై శ్రీకాళహస్తీశ్వరుడు, సింహ వాహనంపై జ్ఞానప్రసూనాంబదేవి బయలుదేరి పెండ్లి మండపం వద్దకు చేరుకోనున్నారు. అనంతరం సోమవారం వేకువ జామున స్వామి, అమ్మవార్ల కల్యాణం నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

ఉత్తీర్ణత సర్టిఫికెట్లు తీసుకెళ్లండి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని వివిధ కేటగిరీల ఉపాధ్యాయులు ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్ష ఉత్తీర్ణత చెందిన సర్టిఫికెట్‌లను తీసుకోవాలని డీఈఓ వరలక్ష్మి పేర్కొన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. 03–03–2024 లో ప్రొఫెషనల్ అడ్వాన్స్‌మెంట్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత చెందిన టీచర్లు డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్‌లు తీసుకోవాలన్నారు. ఉత్తీర్ణత చెందిన టీచర్లు తప్పనిసరిగా హాల్ టికెట్ జిరాక్సులను తీసుకురావాలని డీఈఓ కోరారు.

రేషనలైజేషన్ ప్రక్రియ చేపట్టాలి



డీఈఓకు డైరీని అందజేస్తున్న ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ

చిత్తూరు కలెక్టరేట్ : రేషనలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ కోరారు. ఈ మేరకు గురువారం ఆ సంఘం నాయకులు డీఈఓ వరలక్ష్మిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని టీచర్ల సర్వీస్ రెగ్యులరైజేషన్ జాబితా 2010 డీఎస్సీ వరకు మాత్రమే నిర్వహించారన్నారు. మిగిలిన డీఎస్సీల రేషనలైజేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలన్నారు. స్పెషల్ డ్రైవ్ నిర్వహించి రేషనలైజేషన్ ప్రక్రియ పూర్తి చేసి ఆన్‌లైన్‌లో జాబితాలు అప్‌లోడ్ చేయాలని కోరారు. గతంలో విడుదల చేసిన సీనియారిటీ జాబితాను పునఃసమీక్షించాలన్నారు. మెరిట్ కమ్ రోస్టర్‌లో సీనియారిటీ జాబితా సిద్ధం చేసి వెంటనే విడుదల చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే ఆమోదించాలన్నారు. అనంతరం ఆపస్ డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏబీఆర్‌ఎస్ఎం ఇంటర్మీడియట్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శరత్‌చంద్ర, ఆపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంజునాథగుప్తా, విజయ్, గౌరవాధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, మీడియా కన్వీనర్ రాధాకృష్ణ, గౌరవ సలహాదారు ఉమాపతి పాల్గొన్నారు.

ఎస్వీయూ దూరవిద్యకు అనుమతులు



ఎస్వీయూ డీడీఈ భవనం

తిరుపతి సిటీ: ఎస్వీయూ దూరవిద్య విభాగం ఆధ్వర్యంలో నిర్వహించే కోర్సులకు 2024 – 25 సంవత్సరానికి యూజీసీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ బ్యూరో అనుమతులు మంజూరు చేసింది. జనవరిలో యూజీసీ నిపుణుల బృందం వర్సిటీలో మూడు రోజులు పర్యటించింది. అనుమతుల మంజూరుకు సంబంధించిన అర్హతలపై యూజీసీకి నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో యూజీసీ గురువారం ఎస్వీయూ దూరవిద్య కోర్సులకు 2024–25 విద్యా సంవత్సరం నుంచి అనుమతులు మంజూరు చేస్తున్నట్లు గురువారం ప్రకటించింది. దీంతో వర్సిటీ డీడీఈ విభాగంలో 17 కోర్సుల్లో విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు అవకాశం ఉంటుంది. ఈ సందర్భంగా డీడీఈ కోర్సుల పునరుద్ధరణకు, అనుమతులు రావడానికి కృషి చేసిన వర్సిటీ బోధన, బోధనేతర సిబ్బందికి వీసీ సీహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఏడాది నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నారు.

ఆదర్శం.. ఆహ్వానం

- మోడల్ స్కూల్స్‌లో 6వ తరగతిలో ప్రవేశాలకు అవకాశం
- నోటిఫికేషన్ జారీచేసిన విద్యాశాఖ అధికారులు
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ



రామకుప్పం మోడల్ స్కూల్

చిత్తూరు కలెక్టరేట్ : గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన ఆదర్శ పాఠశాల (మోడల్ స్కూల్స్)లలో రాష్ట్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసి ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతోంది.

సీటు చాలా విలువైనది..

పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలకు ఉన్నత చదువులను అందుబాటులోకి తీసుకురావడమే ధ్యేయంగా ఏపీ మోడల్ స్కూళ్లు ఏర్పాటయ్యాయి. వెనుకబడిన మండలాలను గుర్తించి ఈ పాఠశాలలను ప్రారంభించారు. ఇందులో ఆరో తరగతిలో ప్రవేశం పొందితే ఇంటర్ వరకు ఇంగ్లీష్ మీడియంలో బోధన అందించడంతో పాటు విద్యా కానుక కిట్లు, ఉచితంగా పాఠ్య పుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందజేస్తున్నారు. తొమ్మిది నుంచి ఇంటర్ వరకు చదివే బాలికలకు కార్పొరేట్ తరహా హాస్టల్ వసతి ఏర్పాటు చేశారు. పూర్తి ఇంగ్లీష్ మీడియంతో సత్ఫలితాలను సాధిస్తున్న మోడల్ స్కూల్/జూనియర్ కాలేజీల్లో ప్రవేశాలు పొందడం అంత సులువు కాదు. ప్రైవేటు పాఠశాలల్లో ఎంతో ఖర్చు పెట్టినా అందుబాటులో లేని నాణ్యమైన ఇంగ్లీషు మీడియం విద్య, ఇక్కడ అందుబాటులో ఉండడం పేద పిల్లలకు వరంగా మారింది.

జిల్లాలో 7 మోడల్ స్కూల్స్ వివరాలు

జిల్లాలో నడిమూరు (కుప్పం మండలం), అగరం గ్రామం (గుడుపల్లి), తుమ్సి (శాంతిపురం), కమ్మనపల్లి (బైరెడ్డిపల్లి), ఏఎన్‌కుంట (పుంగనూరు), రామకుప్పం, రొంపిచెర్ల మండలాల్లో మొత్తం 7 మోడల్ స్కూల్స్ ఉన్నాయి. ఈ పాఠశాలల్లో ఒక్కో చోట 100 సీట్లు చొప్పున మొత్తం 700 మందిని ఎంపిక చేస్తారు.

దరఖాస్తు ఇలా..

2025–26 విద్యా సంవత్సరానికిగాను ఈనెల 24వ తేదీ నుంచి నెట్ బ్యాంకింగ్/క్రెడిట్/డెబిట్ కార్డుల ద్వారా ఆన్‌లైన్‌లో పరీక్ష ఫీజు పేమెంట్స్‌కు అవకాశం కల్పించారు. అలాగే దరఖాస్తు చేసుకునే ప్రక్రియ ఈనెల 25వ తేదీ నుంచి ప్రారంభించారు. ఆన్‌లైన్ పేమెంట్స్‌కు మార్చి 31వ తేదీతో గడువు ముగియనుంది. గతేడాది మాదిరిగానే 6వ తరగతిలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. దరఖాస్తు చేసుకున్న మోడల్ స్కూల్‌లోనే ఏప్రిల్ 20వ తేదీన ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరగనుంది. మెరిట్ లిస్టు ఆధారంగా రోస్టర్ ప్రకారం సీట్లను కేటాయించనున్నారు. ఏప్రిల్ 27న మెరిట్‌లిస్టు, అదేరోజు ఎంపిక జాబితాను వెల్లడించనున్నారు. ఏప్రిల్ 30న సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు కౌన్సిలింగ్ ప్రక్రియను చేపట్టనున్నారు. కొత్త విద్యా సంవత్సరం ప్రారంభ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

ముఖ్యంగా గుర్తించు కోవాల్సినవి..

- 6వ తరగతిలో ప్రవేశం పొందాలనుకునే ఓసీ, బీసీ కులాలకు చెందిన విద్యార్థులు 2013 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2015 ఆగస్టు 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. వీరు కనీసం 35 మార్కులు పొంది ఉండాలి. వీరికి పరీక్ష ఫీజు రూ.150 ఉంటుంది.
- 6వ తరగతిలో ప్రవేశం పొందే ఎస్సీ, ఎస్టీ కులాలకు చెందిన విద్యార్థులు 2011 సెప్టెంబర్ 1వ తేదీ నుంచి 2015 ఆగస్ట్ 31వ తేదీ మధ్య జన్మించి ఉండాలి. వీరు కనీసం 30 మార్కులు పొంది ఉండాలి. పరీక్ష ఫీజు రూ.75 చెల్లించాలి.
- సంబంధిత జిల్లాలో ప్రభుత్వ లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో నిరవధికంగా 2023–24, 2024–25 విద్యా సంవత్సరాల్లో 4, 5 తరగతుల్లో చదివి ప్రమోషన్‌కు అర్హత పొంది ఉండాలి.
- పరీక్షలో వచ్చే మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ప్రాతిపాదికన సీట్లు కేటాయిస్తారు.
- ప్రవేశ పరీక్ష ప్రశ్నపత్రం ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటుంది. 5వ తరగతి స్థాయిలో ఉండే ఈ పరీక్షను తెలుగు/ఇంగ్లీష్ మీడియంలో రాయవచ్చు.
- cse.ap.gov.in (లేదా) apms.ap.gov.in వెబ్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



ఆన్‌లైన్ అడ్మిషన్‌ల వెబ్‌సైట్ చిత్రం

సదుపాయాలు ఇలా..

- నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన.
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సువిశాల ప్రాంగణాలతో రెండంతస్తుల భవనాలను కలిగి ఉన్నాయి.
- ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ఇంగ్లీష్ మీడియంలోనే విద్యా బోధన.
- విశాలమైన తరగతి గదులు, విద్యార్థులకు సౌకర్యవంతమైన వాతావరణంలో ఉచిత విద్య.



బైరెడ్డిపల్లి మోడల్ స్కూల్

- బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులకు పూర్తిస్థాయి పరికరాలతో వేర్వేరుగా ల్యాబ్‌లు ఉన్నాయి.
- అత్యాధునిక లాంగ్వేజ్ లాబ్స్ అందుబాటులో ఉన్నాయి.
- నీట్, జేఈఈ, ఎంసెట్, ఎన్‌ఎంఎంఎస్, ఐఎంవో, ఐఎస్వో వంటి పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ
- స్పోకెన్ ఇంగ్లీష్, చేతిరాతపై ప్రత్యేక శ్రద్ధ. అన్ని సౌకర్యాలతో కూడిన గ్రంథాలయం.
- ఎల్‌సీడీ ప్రాజెక్టర్‌తో విద్యా బోధన, డిజిటల్ విద్యా బోధనకు అవకాశం.
- 9వ తరగతి నుంచి అకడమిక్ విద్యకు సమాంతరంగా కనీసం రెండు ఒకేషనల్ కోర్సులు.
- మోడల్ స్కూళ్లకు సమీప గ్రామాల అనుసంధానంతో కూడిన ప్రత్యేక ఆర్టీసీ బస్సులు.

పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలోని పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మోడల్ స్కూల్ ప్రవేశాల ప్రక్రియపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలనే ధ్యేయంతో ఏపీ మోడల్ స్కూళ్లను తీసుకొచ్చారు. ప్రస్తుతం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చేశాయి. ఇంగ్లీష్ మీడియంలో బోధన జరుగుతోంది. ఇంజినీరింగ్, మెడిసిన్ వంటి కోర్సులకు విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం. 6వ తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు జిల్లా

టీడీపీ కంచుకోటకు బీటలు

- కేవీపీఆర్‌పేటలో మార్పునకు తొలి అడుగు
- 'రోజా'కు జననీరా'జనం'



మాజీ మంత్రి ఆర్కేరోజాకు స్వాగతం పలకడానికి ప్రవాహంలా వచ్చిన జనం

నగరి : కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు అవుతున్నా ఇచ్చిన హామీలు ఏవీ అమలు చేయకపోవడం, హామీలు అమలు చేయలేమని చేతులెత్తేయడంతో ఓట్లేసిన ప్రజలు విస్తుపోతున్నారు. బాబు చేతిలో మరోసారి మోసపోయామని ప్రజలకు అర్థమవుతోంది. ఆలోచించకుండా మంచి చేసిన ప్రభుత్వాన్ని చేజేతులా వదులుకున్నామే అంటూ ఆవేదనకు లోనవుతున్నారు. దీంతో మున్సిపల్ పరిధిలో టీడీపీకి కంచుకోటగా ఉన్న కేవీపీఆర్ పేట నుంచి అయ్యప్పన్ అనే టీడీపీ నాయకుడు ఇటీవల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరి జగనన్న నేతృత్వంలో మాజీమంత్రి ఆర్కే రోజా నాయకత్వాన్ని బలపరిచారు. తమ ప్రాంతంలో నిర్వహించే శివరాత్రి ఉత్సవాలకు మాజీ మంత్రి ఆర్కేరోజాకు ఆహ్వానం పలికారు. ఉత్సవాలకు హాజరైన ఆమెకు దారి పొడవునా ప్రవాహంలా వచ్చిన జనం డప్పు వాయిద్యాలు, నృత్యాల నడుమ నీరాజనం పలికారు. స్వతాగా జనం కదలివచ్చిన తీరు కూటమి పాలనపై విసుగు చెందారని, మార్పువైపుగా ప్రజలు పయనిస్తున్నారనే విషయం తేటతెల్లం అయింది. అరుణాచలేశ్వరుని దర్శనానంతరం మాజీ మంత్రి ఆర్కే రోజా మాట్లాడుతూ.. జగనన్న నేతృత్వంలోని తమ ప్రభుత్వం ఎప్పుడూ ప్రజాసంక్షేమాన్ని ఆలోచించే పనిచేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజలను ప్రలోభాలకు గురిచేసి అనుకున్నది సాధించి ఆపై ప్రజలను నట్టేట వదిలేశారన్నారు. ఇప్పటికే ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని ఆ మార్పునకు కేవీపీఆర్ పేటలోనే బీజం పడిందన్నారు. ఆమె వెంట మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు రమేష్ రెడ్డి, కౌన్సిలర్లు గంగాధరం, బీడీ భాస్కర్, మురుగ, బాబు, ఇంద్రయ్య, మోహన్‌రాజ్, భూపాలన్, బాలన్, స్థానిక నాయకులు ఈవీ బాలకృష్ణ, ఏజీ భాస్కర్, టీపీ సురేష్, కన్నాయిరం, సంబంధం, తనికాచలమొదలి, భూపతి, షణ్ముగం పాల్గొన్నారు.



మాజీ మంత్రి ఆర్కేరోజాను సన్మానిస్తున్న కేవీపీఆర్ పేట నేతలు

దేవదాయశాఖ కార్యాలయం మూత

- మధ్యాహ్నం వరకు తెరుచుకోని కార్యాలయం
- తాళం లేక సిబ్బంది పడిగాపులు
- ఆలయ సమస్యలపై వచ్చిన ప్రజలకు నిరాశ



తలుపు వద్దే మధ్యాహ్నం 12.10 గంటలకు నిరీక్షిస్తున్న ఉద్యోగులు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : చిత్తూరు నగరంలోని జిల్లా దేవదాయశాఖ కార్యాలయానికి గురువారం తాళం పడింది. మధ్యాహ్నం 2 గంటల వరకు కార్యాలయ తలుపులు తెరుచుకోలేదు. అంత వరకు కార్యాలయ సిబ్బంది తలుపు వద్దే కునుకు తీశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వారు కార్యాలయం ఎప్పుడెప్పుడు తెరుస్తారని ఎదురు చూశారు. తీరా విచారిస్తే తాళం సహాయ కమిషనర్ చేతిలో ఉన్నట్లు తెలిసింది. ఆమె క్యాంపునకు వెళ్లిపోవడంతో కార్యాలయ తాళం దూరమైంది. కార్యాలయ తలుపులు తెరుచులేకపోయింది. దీంతో సిబ్బందికి విధులు తప్పింది. ఇక కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు పడిగాపులు పడ్డారు. కుప్పం నుంచి వచ్చిన ఓ వ్యక్తి కూడా తీవ్ర నిరాశతో వెనుదిరిగారు. గతంలో ఈ కార్యాలయం ఉదయం 9.30 గంటలకు తెరుచుకునేది. ఆ సమయానికి స్వీపర్ కార్యాలయాన్ని శుభ్రం చేసి సిద్ధంగా ఉంచేవారు. అయితే కొత్తగా వచ్చిన సహాయ కమిషనర్ తాళం తీసే..వేసే బాధ్యతలను కూడా తీసుకున్నట్లు తెలిసింది. దీనిపై సహాయ కమిషనర్ చిట్టెమ్మను వివరణ కోరగా..తాను క్యాంపులో ఉన్నానని, త్వరలో కార్యాలయాన్ని తెరుస్తారని బదులిచ్చారు. మహాశివరాత్రికి అందరికి ప్రత్యేక డ్యూటీలు వేశామని పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 62,323 మంది స్వామిని దర్శించుకున్నారు. 20,460 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.92 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉండగా సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలైన్లోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. ముందుగా వెళితే లోనికి అనుమతించబోమని స్పష్టం చేసింది.

టీచర్ల ఉద్యోగోన్నతులు చేపట్టాలి

చిత్తూరు కలెక్టరేట్ : టీచర్ల ఉద్యోగోన్నతులు చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు డీఈఓ వరలక్ష్మికి గురువారం వినతిపత్రం అందజేశారు. ఉద్యోగోన్నతుల జాబితా కసరత్తు పారదర్శకంగా చేపట్టాలన్నారు. స్పెషల్ ఎడ్యుకేషన్, ప్రత్యేక ప్రతిభావంతుల టీచర్ల ఉద్యోగోన్నతుల జాబితా విడుదలకు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మదన్‌మోహన్ రెడ్డి, మోహన్ మాట్లాడుతూ.. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్ స్పెషల్ ఎడ్యుకేషన్ సబ్జెక్టుకు అర్హత ఉన్న సెకండరీ గ్రేడ్ టీచర్‌లు జిల్లాలో ఉన్నారన్నారు. వారికి సంబంధించిన సీనియారిటీ జాబితాను విడుదల చేయాలన్నారు. వివిధ సబ్జెక్టుల్లో విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగోన్నతులకు కేటాయించిన పోస్టులు భర్తీ చేయాలన్నారు. పాస్‌పోర్టు, ఎన్‌వోసీ తదితర అంశాలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు చంద్రన్, డిల్లీబాబు, సుబ్రహ్మణ్యం, ఉమాపతి పాల్గొన్నారు.

క్లుప్తంగా

జర్నలిస్టుల అక్రిడిటేషన్ గడువు పొడిగింపు

చిత్తూరు, కలెక్టరేట్ : జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో అక్రిడిటేషన్ కార్డుల కాల పరిమితిని మూడు నెలలు పాటు మార్చి 01, 2025 నుంచి మే 31 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటి వరకు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచార పౌర సంబంధాల శాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా గురువారం ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఫిబ్రవరి 28, 2025 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేస్తున్న పాత్రికేయులకు మాత్రమే మార్చి 01,2025 నుంచి మే 31 వరకు అక్రిడిటేషన్ పొడి గింపు సౌకర్యం కొనసాగుతుందని తెలిపారు.

తెలుగు భాషాభ్యున్నతికి కృషి



సమావేశాలను ప్రారంభిస్తున్న వీసీ, మాజీ ఎమ్మెల్సీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ: తెలుగు భాషాభివృద్ధికి సమష్టి కృషి, నిరంతర ప్రణాళికలు అవసరమని ఎస్వీయూ వీసీ సీహెచ్.అప్పారావు తెలిపారు. ఎస్వీయూ తెలుగు అధ్యయనశాఖ, ప్రాచ్య పరిశోధనా సంస్థ, బెంగళూరుకు చెందిన తెలుగు సంపద సంయుక్త ఆధ్వర్యంలో ఎస్వీయూ వేదికగా మూడవ అంతర్జాతీయ తెలుగు భాషా సమావేశాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. భారతీయ భాషల్లో తెలుగుకు ప్రత్యేక స్థానం, విశిష్టత ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విదేశీ భాషల పట్ల వ్యామోహం పెరుగుతోందని, తెలుగు భాష అంతరిస్తూ ఉందనే విషయం సత్య దూరమైనదని చెప్పారు. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆచార్యులు గారపాటి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బోధన, అధికారిక కార్యకలాపాల్లో తెలుగు ప్రాధాన్యం పెరగాలన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్.కృష్ణమూర్తి, విశ్రాంత ఆచార్యులు శలాక రఘునాథశర్మ, సదస్సు సంచాలకులు ఆచార్య రాజేశ్వరమ్మ, నిర్వహణ కార్యదర్శి ఆచార్య పీసీ వెంకటేశ్వర్లు, సలహాదారు డాక్టర్ రేమిళ్ల మూర్తి, పరిశోధకులు రమేష్ పాల్గొన్నారు.

పల్లెల్లో అభివృద్ధి పనులకు 'పల్లె పండుగ' కార్యక్రమం కూటమి నేతలకు ఉపాధిగా మారింది. పుత్తూరు మండలంలోని ప్రతి పంచాయతీలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలకే సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులను కట్టబెట్టారు. దీంతో వారు చేసిందే పని.. వేసిందే రోడ్డుగా చెలరేగిపోయారు. నాణ్యతా ప్రమాణాలను ఏమాత్రం పట్టించుకోకుండా సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు చేపట్టి ప్రజాధనాన్ని నిలువు దోపీడీ చేశారు. ఈ నిర్మాణాలపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా.. అడిగే అధికారి లేరు..చూసే ధైర్యం అధికారులు చేయ లేదు. ఇలా పుత్తూరు మండలంలో 'పల్లె పండుగ'ను తమ్ముళ్లకు కాసుల దోపీడీగా మార్చుకున్నారు.

చేసిందే పని.. వేసిందే రోడ్డు !



సీసీ రోడ్డు వేయాలని కోరుతున్న ఆనంబట్టు గ్రామ దారి, పరమేశ్వరమంగళంలో పనులను పరిశీలిస్తున్న ఏఈ , వీఎస్ఎస్‌పురం పనుల నాణ్యత పరిశీలన

- తమ్ముళ్లకు పల్లె 'పండుగ'
- సీసీ రోడ్లతో నేతలకు 'ఉపాధి'
- ఇష్టారాజ్యంగా పనులు
- నాణ్యతకు తిలోదకాలు
- పట్టించుకోని అధికారులు



వేణుగోపాలపురంలో నాసిరకంగా వేసిన రోడ్డు

పుత్తూరు : గ్రామీణ రోడ్లలో ప్రయాణం ప్రాణాంతకంగా మారింది. వివిధ తుపాన్‌ల ప్రభావంతో కురిసిన వర్షాలకు పల్లెరోడ్లు ఛిద్రమయ్యాయి. ఈ రోడ్లలో నడక అటుంచి, బైక్ , ఆటో వంటి వాహనాలపై ప్రయాణం సైతం ప్రమాదకరంగా మారింది. దీంతో గ్రామీణుల అగచాట్లు వర్ణనాతీతంగా మారింది. పుత్తూరు మండలంలోని 14 పంచాయతీల్లోని పలు గ్రామాలకు చెందిన రోడ్లు బురదమయంగా దర్శనమిస్తున్నాయి. అలాగే గ్రామాల్లో సరైన డ్రైనేజీలు లేక పల్లె ప్రజలు మురుగు మధ్యనే మగ్గుతూ రోగాల బారిన పడి, ఆసుపత్రుల పాలవుతున్నారు. కొందరు విష జ్వరాలు ప్రబలి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. అయినా పాలకులు పల్లెల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో వసతుల కల్పన పేరిట పుత్తూరు మండలంలో 54 సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.167.53 లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో ఇప్పటి వరకు 30 పనులు పూర్తి కాగా 22 పనులు జరుగుతున్నాయి. రెండు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. అయితే ఇప్పటి వరకు పూర్తయిన రోడ్లు నాసిరకంగా నిర్మించారనే ఆరోపణల నేపథ్యంలో క్వాలిటీ కంట్రోల్ అధికారులు అన్ని పనులను పరిశీలిస్తున్నారు.

పుత్తూరు మండల సమాచారం

మండలంలోని పంచాయతీలు -	14
సచివాలయాలు -	10
మండలంలోని గ్రామాల సంఖ్య -	82
మంజూరైన రోడ్ల సంఖ్య -	54
రోడ్లు వేయాల్సిన మీటర్లు -	3,350
అంచనా వ్యయం -	రూ.167.53 లక్షలు
పూర్తయిన రోడ్ల సంఖ్య -	30
నిర్మాణంలో ఉన్న రోడ్లు -	22
ఇంకా ప్రారంభించని పనులు -	02

ఆందోళన చేసినా రోడ్డు వేయలేదు



వర్షం పడితే మా ఆనంబట్టు గ్రామ రోడ్డు బురదమయంగా మారుతుంది. బైక్‌పై నుంచి జారిపడిన సంఘటనలు ఉన్నాయి. తారు రోడ్డు వేయాలని ఇది వరకే చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశాం. అయినా నేటికీ మా గ్రామం రోడ్డు బాగు చేయలేదు. పైడిపల్లి గ్రామం నుంచి ఆనంబట్టు వరకు సీసీ రోడ్డు గానీ, తారు రోడ్డు గాని వేయాలి. పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగానైనా మా రోడ్డును బాగు చేయండి. – కె.రమేష్, ఆనంబట్టు గ్రామం, పుత్తూరు మండలం

రోడ్డు పైనే నీళ్లు నిలుస్తున్నాయి



పేరుకు రోడ్డు వేశారు. చూడడానికి రోడ్డు బాగుంది. రోడ్డుపైనే నీళ్లు నిలిచిపోతున్నాయి. రోడ్డును బాగు చేయాల్సిన అవసరం ఉంది. రోడ్డుకు పక్కన డ్రైనేజీలు కూడా లేవు. మురుగు నీరు ఎలా పోతుంది.? అధికారులు అన్నీ చూసి చేయాలి. – కాంతమ్మ, వేణుగోపాలపురం, పుత్తూరు మండలం

నాణ్యత పరిశీలన తర్వాతే బిల్లులు

రోడ్డు పనులను క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించి, ధ్రువీకరణ చేసిన తర్వాతే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లిస్తాం. రోడ్డు వేసిన దూరం, మందం, నాణ్యతను పరిగణలోకి తీసుకొని పరిశీలిస్తాం. నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పనులు జరగకపోతే బిల్లులు చెల్లించే ప్రసక్తే లేదు. – గాయత్రి, ఏఈ, పంచాయతీరాజ్ శాఖ, పుత్తూరు మండలం

హామీలు మరిచి.. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు

- రైతులను దగా చేస్తున్న ప్రభుత్వం
- రైతులకు యూరియా కష్టాలు
- మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ ధ్వజం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్

కాణిపాకం : బూటకపు మాటలతో కూటమి ప్రభుత్వం రైతులను, అన్ని వర్గాల ప్రజలను దగా చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, పూతలపట్టు నియోజకవర్గ సమన్వయకర్త సునీల్‌కుమార్ ధ్వజమెత్తారు. బంగారుపాళ్యంలో ఆయన గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కర్షకులకు కన్నీళ్లు తెప్పిస్తోందన్నారు. ప్రస్తుతం జిల్లాలో యూరియా దొరకని పరిస్థితి దాపురించిందన్నారు. ప్రైవేటు వ్యక్తుల చేతిలో అమ్మకానికి పెట్టడంతో ఆ కాస్త యూరియా బ్లాక్ మార్కెట్‌కు తరలుతోందన్నారు. బస్తా రూ.226కు విక్రయించాల్సి ఉంటే..రూ.380కు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. అన్నదాత సుఖీభవకు ఎసురు పెట్టి రైతుల కడుపు కొట్టడం సరికాదన్నారు. సూపర్‌సిక్స్‌ను పక్కన పెట్టి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడం దుర్మార్గమన్నారు. కార్యకర్తలపై తప్పుడు కేసులు బనాయించడం సరికాదని ఖండించారు. పోసానిపై అక్రమంగా కేసు పెట్టడం దారుణమని, ఇలాంటి రౌడీ పాలనకు ప్రజలే బుద్ధి చెబుతారని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో మండల కన్వీనర్ పాలేరు రామచంద్రారెడ్డి, నాయకులు శిరీష్‌రెడ్డి, పాలాక్షిరెడ్డి, అన్నమలరెడ్డి, రాష్ట్ర రైతు నాయకులు ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

క్వారీ తవ్వకాలకు అనుమతించొద్దు



ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు, అధికారులతో వాదనకు దిగిన స్థానికులు

- ప్రజాభిప్రాయ సేకరణలో వేడుకోలు
- ఆందోళన వ్యక్తం చేసిన బండపల్లి, బేవనపల్లి ప్రజలు

శాంతిపురం : రాతి క్వారీ తవ్వకాలకు అనుమతించవద్దని సి.బండపల్లి, బేవనపల్లి గ్రామాల ప్రజలు అధికారులకు మొరపెట్టుకున్నారు. ముద్దనపల్లి రెవెన్యూ లోని సర్వే నంబర్ 54/పి లోని 4.301 హెక్టార్లలో మెస్సర్స్ బియాండ్ స్కేల్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు తవ్వకాలు జరిపేందుకు గురువారం సి.బండపల్లిలో ప్రజాభిప్రాయ సేకరణ జరిపారు. కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులు, కాలుష్య నియంత్రణ మండలి అధికారి రాజశేఖర్ ప్రజల అభిప్రాయాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా సి.బండపల్లి, బేవనపల్లి గ్రామాల ప్రజలు క్వారీ తవ్వకాలను పూర్తిగా వ్యతిరేకించారు. ప్రతిపాదిత క్వారీ నుంచి 10 మీటర్లలోపు 500 ఏళ్ల నాటి జొన్న గంగమ్మ ఆలయం ఉందని చెప్పారు. జడ్పీ ఉన్నత పాఠశాల, గ్రామానికి 500 మీటర్ల లోపు క్వారీకి అనుమతులు ఇవ్వరాదని స్పష్టం చేశారు. ఇంత తక్కువ దూరంలో క్వారీ పేలుళ్లు జరిపితే నివాస గృహాలు, స్కూలు భవనాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. పంచాయతీకి చెందిన డంపింగ్ యార్డు కూడా ఇదే సర్వే నంబర్‌లో ఉందన్నారు. సమీపంలోని క్వారీలో పేలుడు పదార్థాల వినియోగం కారణంగా పక్కనే ఉన్న శ్యామనకుంట, పెద్దవంక చెరువు, నాయనచెరువులలో నీరు కలుషితం అవుతోందన్నారు. కొత్తగా మరో క్వారీకి ఇక్కడ అనుమతులు ఇస్తే కాలుష్య ముప్పు మరింత పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్థానికుల అభిప్రాయాలు, అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోకుండా క్వారీకి అనుమతులు ఇచ్చేసి, ఇప్పుడు వచ్చి తవ్వకాల కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్నారని ఆగ్రహంతో వాదనకు దిగారు. దీంతో స్థానికుల అభ్యంతరాలను తాము ప్రభుత్వ దృష్టికి తీసుకుపోతామని చెప్పి అధికారులు ప్రజాభిప్రాయ సేకరణను ముగించారు. కాగా క్వారీకి అనుమతి పొందిన సంస్థ కూటమి ప్రభుత్వంలోని ఓ మంత్రి బినామీ సంస్థగా ప్రచారం సాగుతోంది.

'వివాదాల' వైద్యఆరోగ్యం

- డీఎంఅండ్‌హెచ్ కార్యాలయంలో ఇష్టారాజ్యం
- విధుల కేటాయింపుల్లో రాజకీయం
- సీనియర్లకు అన్యాయం.. జూనియర్లకు అవకాశాలు
- మార్పులు.. చేర్పులపై బహిరంగ విమర్శలు



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం

చిత్తూరు రూరల్ (కాణిపాకం) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో గందరగోళం నెలకొంది. ఇంటి పోరు తార స్థాయికి చేరింది. మానిటరింగ్ విభాగంపై వివక్ష చూపుతున్నారు. కక్ష్య కట్టి ముగ్గురు సీనియర్లను కార్యాలయం నుంచి తప్పించారు. అనుకూలంగా ఉన్న జూనియర్లను తెచ్చుకుంటున్నారు. దీంతో కార్యాలయంలో సర్వత్రా విమర్శలు వెలువెత్తుతున్నాయి. రెండు నెలల కిందట చిత్తూరు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న ప్రభావతి బదిలీ అయ్యారు. ఈ స్థానానికి చంద్రగిరిలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓగా పనిచేస్తున్న సుధారాణికి బాధ్యతలు అప్పగించారు. ఈ క్రమంలో కొందరు వ్యక్తులు ఆమెకు చేరువయ్యారు. దీంతో కార్యాలయ పెత్తనం ఆ కొందరి చేతుల్లోకి వెళ్లిపోయింది. వాళ్లు ఊ అంటే ఆ జిల్లా స్థాయి అధికారి ఉలిక్కిపడుతున్నారు. వారి చెప్పిందే వేదంగా కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. ఈ నేపథ్యంలో ముగ్గురు మానిటరింగ్ అధికారులపై వేటు వేశారు. డాక్టర్ శిరీష, హనుమంతరావు, జానకీరామ్‌లను కక్ష్య కట్టి కార్యాలయం నుంచి తప్పించారు. వెంటనే వారిని కార్యాలయం నుంచి వెంటనే వెళ్లిపోవాలని, ఈ స్థానానికి జూనియర్లు అంటే..పూతలపట్టు వైద్యులు ప్రవీణ, బొమ్మసముద్రం నుంచి అనూష, ఎస్ఆర్‌పురం నుంచి గిరిలను పట్టుబట్టి.. కార్యాలయాన్ని తీసుకొచ్చేలా ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో కార్యాలయంలో లుకలుకలు మొదలయ్యాయి. ఇదంతా కార్యాలయంలో ప్రస్తుతం జరుగుతున్న అక్రమ వ్యవహారం బయట పడుతుందని ఆ ముగ్గురిని టార్గెట్ చేసి కార్యాలయం నుంచి తప్పించినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ముడుపులు ముట్టజెప్పితేనే ..ఫైళ్లు ముందుకు

పీజీ శిక్షణ వెళ్లే వైద్యులకు రిలీవ్ ఆర్డర్లు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని, పై నుంచి ఉత్తర్వులు రావాలని సాకు చూపిస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇక్కడ కాసులిస్తే తప్ప పనులు కావడం లేదనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఇక సీనియర్ అసిస్టెంట్‌ల ఉద్యోగోన్నతి విషయంలో సంతకానికి బట్టి ముడుపులు అడుగుతున్నట్లు కొందరు చెబుతున్నారు. ఆస్పత్రిని బట్టి భారీగా డిమాండ్ చేస్తున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ వసూళ్ల పర్వానికి కొందరు బుద్ధి చెప్పే పనిలో పడ్డారు. ఏసీబీకి ఉప్పందించి రెడ్ హ్యాండడ్‌గా పట్టించాలనే ప్రయత్నాల్లో ఉన్నట్లు తెలుస్తోంది.

నిలబడి నీరసించిపోతున్నారు..

గతేడాది వరకు కార్యాలయం కాస్త సాఫీగా సాగింది. అయితే రెండు నెలల కాలంలో ఓ అధికారిని కలవాలంటే వైద్యులు, కార్యాలయ సిబ్బందికి పురిటినొప్పులు పడుతున్నారు. ఆ అధికారి ఛాంబర్ ముందు నిలబడి నీరసించిపోతున్నారు. చీటి రాసి ఇస్తే..తీరిక ఉంటే పిలుస్తున్నారు..లేదంటే పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. గంటల తరబడి వేచి ఉండలేక విసిగిపోతున్నారు. కార్యాలయ సిబ్బంది అయితే ఫైళ్లు చేతులో పెట్టుకుని పిలుపు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తుంటారు. ఆ తర్వాత వెళ్లినా ఛీదరింపులు తప్ప ఫైళ్లల్లో సంతకాలు పడడం లేదని వారు వాపోతున్నారు. ఇలా వందల ఫైళ్లు పెండింగ్‌లో పడ్డాయి. ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు మూలకు చేరాయి. పాత డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతి పనిచేసిన సమయంలో ఉన్న ఆస్పత్రుల రిజిస్ట్రేషన్లు 10 వరకు పక్కన పెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మొగిలి ఘాట్‌లో ఆటోను ఢీకొన్న లారీ


– 9 మంది భక్తులకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

బంగారుపాళెం : మండలంలోని మొగిలి ఘాట్‌లో చెన్నై–బెంగళూరు జాతీయ రహదారిపై గురువారం ఆటోను లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడియాత్తంకు చెందిన 9 మంది భక్తులు గాయపడ్డారు. అందులో నలుగురు మహిళలు తీవ్రంగా గాయపడగా మరో ఐదు మందికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన తొమ్మిది మంది భక్తులు మొగిలి శివాలయానికి బయలుదేరారు. గుడియాత్తం నుంచి పలమనేరుకు బస్సులో వచ్చారు. అక్కడ నుంచి మొగిలికి ఆటోలో బయలుదేరారు. మార్గ మధ్యలో మొగిలి ఘాట్ వద్ద ఆటోను పలమనేరు నుంచి చిత్తూరు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో గుడియాత్తంకు చెందిన పద్మ, తులశమ్మకు కాళ్లు విరిగిపోయాయి. కల్పన తలకు బలమైన గాయమైంది. ప్రేమ తీవ్రంగా గాయపడింది. మరో ఐదుగురికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పద్మ, తులశమ్మ, కల్పన పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ద్విచక్రవాహనం ఢీకొని వ్యక్తి మృతి



చొక్కలింగం (ఫైల్)

కార్వేటినగరం : ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండల పరిధిలోని అన్నూరు బస్‌షెల్టర్ వద్ద చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై గురువారం చోటు చేసుకుంది. ఎస్ఐ రాజ్‌కుమార్ కథనం మేరకు వివరాలు ఇలా.. వెదురుకుప్పం మండలం చవటగుంట దళితవాడకు చెందిన గోవర్ధన్ ద్విచక్ర వాహనంలో కార్వేటినగరం మండలం గోపిశెట్టిపల్లి దళితవాడలోని తన అత్తగారి ఇంటికి వచ్చి తిరుగు ప్రయాణంలో అన్నూరు బస్టాండ్ వద్ద మండలంలోని అల్లాగుంట గ్రామానికి చెందిన చొక్కలింగం(66) బస్సు కోసం వేచి ఉన్న సమయంలో గోవర్ధన్ ద్విచక్ర వాహనంలో వేగంగా దూసుకొచ్చి చొక్క లింగాన్ని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.అలాగే ద్విచక్ర వాహనంలో వచ్చిన గోవర్ధన్‌కు తీవ్రగాయాలు కావడంతో అతడిని మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. చొక్కలింగం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

ఆశలు.. ఊసులు

- రాష్ట్ర బడ్జెట్‌పై జిల్లా వాసుల ఎదురు చూపులు
- ఆలయాల అభివృద్ధికి కరువైన నిధులు
- పర్యాటక అభివృద్ధికి నిధులే కీలకం
- సంక్షేమ పథకాల అమలుపై ప్రశ్నిస్తున్న జనం



చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర శాసనసభలో శుక్రవారం ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో జిల్లా వాసులు బడ్జెట్‌లో నిధుల కేటాయింపుపై ఆశలు పెట్టుకున్నారు. ప్రధానంగా జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు, భూసేకరణ సమస్యలు, ప్రధాన ఆలయాల అభివృద్ధి, పర్యాటక రంగం, పరిశ్రమలు, ఇతర అభివృద్ధి ప్రాజెక్టులపై జిల్లా వాసుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. సీఎం చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరు కావడంతో బడ్జెట్ పై రైతులు, మహిళలు, వ్యాపారులు, పేద, మధ్య తరగతి వర్గాలకు దక్కనున్న ప్రయోజనంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

జాడలేని సంక్షేమం

జిల్లాలో 4.56 లక్షల కుటుంబాలున్నాయి. ఈ కుటుంబాల్లో 18.73 లక్షల మంది నివసిస్తున్నారు. పురుషులు 9.40 లక్షలు, మహిళలు 9.33 లక్షల మంది ఉన్నారు. రూరల్‌లో 15.04 లక్షల మంది, అర్బన్‌లో 3.85 లక్షల మంది నివసిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తోంది. ఈ ప్రభుత్వం సార్వత్రిక ఎన్నికల సమయంలో సంక్షేమ పథకాల అమలుపై ఎన్నో హామీలు గుప్పించింది. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీలను తప్పక నెరవేరుస్తామన్నారు. అయితే అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలవుతున్నా ఇంత వరకు ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

సాగునీటి ప్రాజెక్టుల ప్రాధాన్యం కల్పించాలి

చిత్తూరు జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులపైనే రైతులు, ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ప్రజల నీటి కష్టాలను తీర్చేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పుంగనూరు నియోజకవర్గంలో మూడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లను ప్రారంభించింది. ముదివేడు, నేతిగుంటపల్లి, ఆవులపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లను నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. ఇందుకు గతంలో రూ.2144.50 కోట్ల అంచనాలు సైతం సిద్ధం చేశారు. అయితే పలు కారణాలతో పెండింగ్ పడిన ఆ రిజర్వాయర్‌లను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలోని పుంగనూరు, కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో గండికోట రిజర్వాయర్, అలాగే చిత్తూరు, జీడీనెల్లూరు, పూతలపట్టు, నగరి నియోజకవర్గాల్లో కండలేరు రిజర్వాయర్ పనులను వెంటనే పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఈ రెండు ప్రాజెక్టుల పూర్తికి రూ.7659.06 కోట్లు అవసరమవుతుందని అధికారులు అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి పంపారు.

పర్యాటక అభివృద్ధికి నిధులు అవసరం

జిల్లాలో పర్యాటక అభివృద్ధికి నిధులు అవసరం ఉంది. జిల్లాను పర్యాటక పరంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లాలోని ప్రధానమైన కాణిపాకం, బోయకొండ, అర్ధగిరి, ననియాల తదితర ప్రాంతాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. కుప్పం, నగరి, పలమనేరు, పులిగుండు వద్ద ఉన్న పర్యాటక హోటల్‌లు నిధుల కొరతతో అభివృద్ధిలో వెనుకబడ్డాయి. జిల్లాలో పర్యాటక అభివృద్ధికి రూ.57.24 కోట్ల ప్రతిపాదనలను అధికారులు ప్రభుత్వానికి పంపారు. పర్యాటక అభివృద్ధికి కూటమి టీడీపీ చొరవ చూపుతుందో లేదో వేచి చూడాల్సిందేనని ప్రజలు నిరీక్షిస్తున్నారు.

ఆలయాల అభివృద్ధికి ..

చిత్తూరు జిల్లాలో దేవాదాయ శాఖ అధీనంలో మొత్తం 1592 ఆలయాలున్నాయి. వీటిలో 6ఏ కింద 06, 6 బీకింద 25, 6సీ కింద 1546, 6డీ కింద 15 ఆలయాలున్నాయి. వీటిలో ప్రధానమైన ఆలయాల్లో సౌకర్యాలు మెరుగు చేయాల్సిన అవసరం ఉంది. ఆలయాల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించడం లేదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. జిల్లాలోని కాణిపాకం, అర్ధగిరి అరగొండ, బోయకొండ, తదితర ఆలయాల్లో సౌకర్యాలను మెరుగు పర్చాలని జిల్లా వాసులు కోరుతున్నారు.

జిల్లా సమాచారం

జిల్లాలోని రెవెన్యూ డివిజన్‌లు	04
జిల్లాలోని మండలాలు	32
జిల్లాలోని రెవెన్యూ గ్రామాలు	822
జిల్లాలోని గ్రామ పంచాయతీలు	697
జిల్లా జనాభా	18.73 లక్షలు
పురుషులు	9.40 లక్షలు
మహిళలు	9.33 లక్షలు
రూరల్ జనాభా	15.04 లక్షలు
అర్బన్ జనాభా	3.69 లక్షలు

అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలి



జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కూటమి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఎన్నికల సమయంలో ప్రజలకు చాలా గొప్ప హామీలు గుప్పించారు. ఇప్పుడు ఆ హామీలన్నీ ఎందుకు అమలు చేయడం లేదో తెలియజేయాలి. తొమ్మిది నెలలవుతున్నా ఇచ్చిన హామీలు అమలు చేయని పరిస్థితి. ఈ బడ్జెట్‌లోనైనా జిల్లా అభివృద్ధికి సీఎం చంద్రబాబు ప్రత్యేక నిధులు కేటాయిస్తారో లేదో.. చూడాలి. – నాగరాజు, సీపీఐ జిల్లా కార్యదర్శి. చిత్తూరు.

ప్రజలకు ఎలాంటి మేలూ కలగలేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలలుగా ప్రజలకు ఎలాంటి మేలూ కలగలేదు. ఎన్నికలకు ముందు సూపర్ సిక్స్ అంటూ ఎన్నో గొప్పలు చెప్పారు. అధికారంలోకి వచ్చాక ఆ గొప్పలన్నీ ఏమయ్యాయో అర్థం కావడం లేదు. పలు శాఖల్లో రాజకీయ నాయకులు ఒత్తిడి పెట్టి ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. కార్మికులపై కూటమి ప్రభుత్వం ప్రతాపం చూపడం సరైన పద్ధతి కాదు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, అభివృద్ధి పనులకు బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి. – వాడ గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి, చిత్తూరు జిల్లా